# నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్ - మేడ్చల్
13 హైదరాబాద్, మంగళవారం 30 జనవరి 2024 HYDERABAD





## సీసీఎంబీ రీసెర్చ్ స్కాలర్‌కు అవార్డు

సిటీబ్యూరో, జనవరి 29 (నమస్తే తెలంగాణ) : సెంటర్ ఫర్ సెల్యూలార్ అండ్ మాలిక్యూలార్ బయాలజీ రీసెర్చ్ స్కాలర్ ప్రత్యూష స్టూడెంట్ స్కాలర్ షిప్ అవార్డుకు ఎంపికయ్యారు. అహ్మదాబాద్ వేదికగా జరిగిన 48వ ఇండియన్ సొసైటీ ఆఫ్ హ్యూమన్ జెనెటిక్స్ వార్షిక సదస్సులో బహుమతిని అందజేశారు. భారతదేశం జనాభాలో జీవ వైవిధ్యం– ప్రభావంపై ఆమె చేసిన అధ్యయానికి ఈ అవార్డు లభించింది.



ఖైరతాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

## మతం పేరుతో బీజేపీ రాజకీయాలు

### హైదరాబాద్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు మాగంటి గోపీనాథ్

బంజారాహిల్స్, జనవరి 29: సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని అన్ని సీట్లలో ప్రస్తుతం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్నారని, రానున్న ఎన్నికల్లో కచ్చితంగా ఎంపీ స్థానాన్ని గెలిపించుకుంటామని హైదరాబాద్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. సోమవారం బంజారాహిల్స్‌లోని లేక్‌వ్యూ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఖైరతాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మాట్లాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో సికింద్రాబాద్ స్థానం నుంచి కచ్చితంగా బీఆర్ఎస్ అభ్యర్థి గెలిచే అవకాశం ఉందన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి పార్లమెంట్ పరిధిలో సుమారు 4.80 లక్షల ఓట్లు వచ్చాయని, బీజేపీ అభ్యర్థులకు కేవలం రెండున్నర లక్షల ఓట్లు మాత్రమే వచ్చాయని గుర్తు చేశారు. మతం పేరుతో రాజకీయాలు చేసే బీజేపీకి ఇటీవల శాసనసభ ఎన్నికల్లో గ్రేటర్ ప్రజలు బుద్ధి చెప్పారని, మరోసారి పార్లమెంట్ ఎన్నికల్లో కూడా అదే ఫలితం బీజేపీకి వస్తుందని జోస్యం చెప్పారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ ఎల్. రమణ, బీఆర్ఎస్ నేత రావుల శ్రీధర్ రెడ్డి, అర్షద్ నవాబ్, కార్పొరేటర్లు మన్నె కవితారెడ్డి, మహాలక్ష్మిగౌడ్, వనం సంగీతా యాదవ్ తదితరులు పాల్గొన్నారు.




## బడ్జెట్‌పై బల్దియా కసరత్తు

సిటీబ్యూరో, జనవరి 29 (నమస్తే తెలంగాణ ): బడ్జెట్ ముసాయిదాపై జీహెచ్ఎంసీ కసరత్తు ముమ్మరం చేసింది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి రెండు కేటగిరీల బడ్జెట్ ప్రతిపాదనలను రూపొందిస్తున్నది. జీహెచ్ఎంసీ నిధులకే చెందిన బడ్జెట్‌ను 'ఏ' కేటగిరీగా, ఇతర సంస్థల నుంచి అందే నిధులను 'బీ'గా చూపనున్నది. 2023–24 సంవత్సరానికి బడ్జెట్ రూ. 6,224 కోట్లుగా చూపగా..వచ్చే బడ్జెట్ కూడా దాదాపు రూ.6500కోట్ల మేర ఉండేలా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. రెవెన్యూ ఆదాయం, ఖర్చులు, సర్‌ప్లస్ రెవెన్యూ, ప్రాపర్టీ ట్యాక్స్ ద్వారా రాబడి, పట్టణ ప్రగతి, టౌన్‌ప్లానింగ్ ద్వారా వచ్చే ఆదాయం, అప్పులు, ఇతర ఆదాయం తదితర అంశాలపై పరిగణనలోకి తీసుకొని బడ్జెట్ రూపకల్పన చేస్తున్నారు. ఇదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్‌లో బల్దియాకు కేటాయించాల్సిన నిధులపై సోమవారం పురపాలక ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్ కమిషనర్ రోనాల్డ్‌రాస్ నుంచి వివరాలు అడిగి తెలుసున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా జీహెచ్ఎంసీ ఆర్థిక పరిస్థితిని వివరించారు. ఎస్ఆర్‌డీపీ, ఎస్ఎన్‌డీపీ రెండో దశ అధిక నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిసింది.




## పారిశుధ్య యంత్రాలు ఊడుస్తున్నయా?

### స్వీపింగ్ యంత్రాల స్థానంలో కార్మికులతో పనులు

- ఏజెన్సీలకు కొమ్ముకాస్తున్నట్లు ఆరోపణలు
- రంగంలోకి విజిలెన్స్ బృందాలు..
- పారిశుధ్య నిర్వహణ అక్రమాలపై నజర్
- త్వరలోనే కమిషనర్‌కు సమగ్ర నివేదిక?

సిటీబ్యూరో, జనవరి 29 (నమస్తే తెలంగాణ) : పారిశుధ్య నిర్వహణ అక్రమాల నిగ్గు తేల్చేందుకు బల్దియా విజిలెన్స్ బృందం రంగంలోకి దిగింది. ఇటీవల సర్కిల్ –15 (ముషీరాబాద్)కు చెందిన ఇద్దరు పారిశుధ్య కార్మికులు తెలుగు తల్లి ఫ్లైఓవర్‌పై స్వీపింగ్ యంత్రాలకు బదులుగా పనిచేశారు. అయితే స్వీపింగ్ యంత్రాలతో శుభ్రం చేయించాల్సిన చోట కార్మికులతో పనులు చేస్తున్నారని, యంత్రాలు నడవకపోయినా.. ఏజెన్సీలు బిల్లులు క్లెయిమ్ చేస్తున్నాయంటూ.. తదితర అంశాలతో 'నమస్తేతెలంగాణ' ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. దీనిపై కమిషనర్ రోనాల్డ్ రాస్ స్పందించారు. సంబంధిత శానిటేషన్ విభాగం అడిషనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డిని ఆరా తీశారు. కమిషనర్‌కు ఉపేందర్‌రెడ్డి సరైన సమాధానం ఇవ్వలేకపోయారు. కమిషనర్‌ను తప్పుదోవ పట్టించే రీతిలో వ్యవహరించారన్న చర్చ ఉద్యోగుల్లో జరిగింది. సదరు అదనపు కమిషనర్‌పై కమిషనర్ రోనాల్డ్‌రాస్ ఒకింత అసహనాన్ని వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే అవినీతి ఆరోపణలు ఉన్న ఉపేందర్‌రెడ్డిని శానిటేషన్ విభాగంలో ఎందుకు నియమించారని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సైతం కమిషనర్‌తో చర్చించారు. ఈ నేపథ్యంలో శానిటేషన్ విభాగంలో స్వీపింగ్ యంత్రాల నిర్వహణలో జరుగుతున్న తంతును నిగ్గు తేల్చేందుకు విజిలెన్స్ బృందం దృష్టి సారించింది. త్వరలోనే కమిషనర్ రోనాల్డ్ రాస్‌కు నివేదిక ఇవ్వనున్నట్లు ఉద్యోగుల్లో చర్చ జరుగుతున్నది. కాగా, జీహెచ్ఎంసీలో దాదాపు 35 స్వీపింగ్ యంత్రాలు ఉండగా.. వీటిలో బల్దియాకు చెందిన 17 వాహనాల కాలపరిమితి ముగియడంతో పక్కన పడేశారు. ప్రస్తుతం సుమారు 18 వెహికల్స్ అద్దె ప్రాదిపదికన కొనసాగుతున్నాయి. ఇందుకు గాను ఏజెన్సీలకు ఒక్కో వాహనానికి ఏడాదికి రూ. కోటి 13 లక్షలకు పైగా చెల్లిస్తున్నారు. ప్రతి ఏటా వీటి కోసం రూ. 20కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నారు. ఈ స్వీపింగ్ యంత్రాలతో ఒక్కో మిషిన్ 40 కిలోమీటర్ల నుంచి 60 కిలోమీటర్ల వరకు క్లీన్ చేయాలి. కానీ కొన్ని ఏజెన్సీలు సగం కిలోమీటర్లు కూడా శుభ్రం చేయకుండా బిల్లులు క్లెయిమ్ చేస్తున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. వీటితో పాటు నగరంలోని వీఐపీలు ఉండే ప్రాంతాల్లోనే తప్ప కమర్షియల్ కారిడార్లు, ప్రధాన రహదారులపై మాత్రం యంత్రాలు కనిపించడం లేదని కార్మిక సంఘాల నేతలు వాపోతున్నారు.



రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న చెరుకూరి శ్రీనివాస్ రావు

## స్థలం కబ్జాకు నకిలీ భార్య

### బతికుండగానే డెత్ సర్టిఫికెట్ సృష్టించారు

బండ్లగూడ, జనవరి 29: అది ఖరీదైన స్థలం. చూస్తూ ఊరుకోలేకపోయారు కబ్జారాయుళ్లు. అమెరికాలో ఉన్న యజమాని వస్తాడా ? వచ్చి ఏమైనా చేస్తాడా ? ఆ లోపే భూమిని మింగేస్తే పోలా! అని యజమాని చనిపోయినట్టు డెత్ సర్టిఫికెట్ సృష్టించారు. పనిలో పనిగా ఓ నకిలీ భార్యను తెరపైకి తెచ్చారు. ఇక రిజిస్ట్రేషనే తరువాయి అని సంబురపడ్డారు. సబ్‌రిజిస్ట్రార్ చాకచక్యంతో కబ్జా ముఠా గుట్టురట్టయింది. ఏపీలోని కృష్ణా జిల్లాకు చెందిన చెరుకూరి శ్రీనివాస్‌రావు అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ అక్కడే నివాసం ఉంటున్నారు. ఆయనకు రాజేంద్రనగర్ మండల పరిధిలోని జనచైతన్య హౌసింగ్ సొసైటీలో 400 గజాల స్థలం ఉన్నది. ఆ స్థలాన్ని కబ్జా చేసేందుకు కుట్రపన్నిన కొందరు వ్యక్తులు శ్రీనివాసరావు చనిపోయాడని డెత్ సర్టిఫికెట్ సృష్టించారు. ఆయనకు నకిలీ భార్యను సృష్టించి భర్త పేరున ఉన్న స్థలాన్ని భార్య పేరు మీదకు మార్చాలని ఇటీవల రిజిస్ట్రార్ ఆఫీస్‌కు వెళ్లారు. భర్త ఎప్పుడు చనిపోయాడని సబ్ రిజిస్ట్రార్ ఆమెను అడుగగా, ఒకసారి ఐదేండ్ల కిందట, మరోసారి రెండేండ్ల కిందట అంటూ తడబడింది. అనుమానం వచ్చిన సబ్‌రిజిస్ట్రార్ లింకు పత్రాల ఆధారంగా అసలు భూమి యజమానికి సమాచారం అందించారు. సోమవారం శ్రీనివాసరావు రిజిస్ట్రర్ ఆఫీస్‌కు హాజరై ఒరిజినల్ పత్రాలను చూపించారు. అలాగే నిందితులపై రాజేంద్రనగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు.

## 3 కోట్లు వసూలు చేసి.. బిచాణా ఎత్తేసి

### 'బ్యూటీపార్లర్' ఫ్రాంచైజీ పేరిట.. కుచ్చుటోపీ

దుండిగల్, జనవరి 29: బ్యూటీ పార్లర్ ఫ్రాంచైజీ పేరిట ఘరానా మోసానికి పాల్పడిందో ముఠా. సుమారు రూ.3కోట్లకు పైగా నిధులను ఔత్సాహికుల నుంచి వసూలు చేసి బిచాణా ఎత్తేసింది. బాధితులు, బాచుపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సూరారం కాలనీలోని భవానీనగర్‌కు చెందిన సుష్మా స్థానికంగా బ్యూటీపార్లర్ నడుపుకొంటూ ఉపాధి పొందుతున్నారు. ఏడాది కిందట ప్రగతినగర్‌లోని నెమలిబొమ్మ చౌరస్తా వద్ద ఉన్న 'రోజ్ గోల్డ్ బ్యూటీ పార్లర్' యాజమాన్యం తమ సంస్థ పేరిట ఫ్రాంచైజీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలుసుకొని సంప్రదించారు. తమ ఫ్రాంచైజీ తీసుకుంటే.. తామే కావాల్సిన ప్రొడక్ట్స్, మెటీరియల్ సప్లై చేస్తామని, రూ. 35 వేల జీతం సైతం అందిస్తామని నిర్వాహకులు సమీనా, ఆమె భర్త షేక్ ఇస్మాయిల్, దేవకుమారి, రవి, విశ్వతేజ నమ్మబలికారు. దీంతో సుష్మా రెండు ఫ్రాంచైజీల కోసం 5 లక్షల 20వేల రూపాయలను చెల్లించారు. కొన్ని నెలలు జీతం, సామగ్రి పంపించిన రోజ్ గోల్డ్ బ్యూటీ పార్లర్ యాజమాన్యం.. ఆ తర్వాత నిలిపివేసింది. సుమారు రూ.3 కోట్ల మేర ఈ ముఠా ఫ్రాంచైజీల పేరిట వసూలు చేసినట్లు సుష్మా తెలుసుకున్నారు. దీంతో 27న ఆమె బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా, రోజ్ గోల్డ్ బ్యూటీ పార్లర్ యాజమాన్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## హోంగార్డు కారు కొట్టేసిండు

బంజారాహిల్స్, జనవరి 29: ఆరునెలలుగా రోడ్డుపక్కన పార్క్ చేసిన కారును తస్కరించిన ఓ ట్రాఫిక్ హోంగార్డు కటకటాలపాలయ్యాడు. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. రోడ్ నం. 12లోని ఎన్‌బీటీనగర్‌లో ఉంటున్న కాలవకూరి లోకేశ్ సింగ్ ఓ సంస్థలో సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. అతడి యజమాని హరిదీప్ సింగ్‌కు చెందిన కారు కొంతకాలంగా లోకేశ్ వద్దే ఉన్నది. బస్తీలో తన ఇంటివద్ద పార్కింగ్ స్థలం లేకపోవడంతో ఎమ్మెల్యే కాలనీలోని ఏసీబీ కార్యాలయం సమీపంలో ఆరునెలలుగా పార్క్ చేస్తున్నాడు. అయితే కారును తొలగించాలని స్థానికులు ట్రాఫిక్ పోలీసులకు చెప్పడంతో సమీపంలోని షరోన్ చర్చి ముందు ఖాళీ స్థలంలోకి తీసుకెళ్లి పెట్టారు. ఆ సమయంలో బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న అసిఫ్‌నగర్ రాఘవేంద్ర కాలనీకి చెందిన ఠాకూర్ నితేశ్‌సింగ్‌కు ఆ కారుపై కన్నుపడింది. ఆరునెలలుగా కారు ఇక్కడే ఉంటోందని, ఎవరూ రావడం లేదని స్థానికులు చెప్పడంతో తస్కరించాలని ప్లాన్ వేశాడు. టోయింగ్ వాహనంతో ఆసిఫ్‌నగర్‌లోని తన స్నేహితుడి ఇంటి వద్దకు తరలించాడు. సర్వీసింగ్ చేయించడంతో పాటు దర్జాగా అదే కారులో నగరంలో షికార్లు కొడుతున్నాడు. కారు కనిపించడం లేదని లోకేశ్ ఈ నెల 25న బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన క్రైం పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా నితేశ్ సింగ్‌ను అరెస్ట్ చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు.



**నేడు బాపూజీ వర్ధంతి** మహాత్మాగాంధీ వర్ధంతి నేపథ్యంలో బాపూఘాట్‌లో ఏర్పాట్లను జిల్లా అడిషినల్ కలెక్టర్ మధుసూదన్, ఆర్డీవో సూర్య ప్రకాశ్, గోల్కొండ తహసీల్దార్ అహల్యా రెడ్డి, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ శశిరేఖ తదితరులు పరిశీలించారు. -మెహిదీపట్నం జనవరి 29

## నేడు మాంసం దుకాణాలు బంద్

సిటీబ్యూరో, జనవరి 29 (నమస్తే తెలంగాణ) : జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం జీహెచ్ఎంసీ పరిధిలో మాంసం దుకాణాలను మూసి వేయాలని కమిషనర్ రోనాల్డ్‌రాస్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. నిబంధనలు అతిక్రమించిన దుకాణాదారులపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కాగా, ఉదయం 10 గంటల నుంచి 11.30 గంటల వరకు బాపూఘాట్, లంగర్‌హౌస్, రేతిబౌలి జంక్షన్, నాలానగర్ జంక్షన్, లంగర్‌హౌస్, సంగం బస్‌స్టాప్, షేక్‌పేట్ నాలా తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను నిలిపివేయడం లేదంటే మళ్లించడం చేస్తామని ట్రాఫిక్ అదనపు సీపీ తెలిపారు.



## ఉద్యమ జ్ఞాపకం

ఎన్నో చారిత్రక పోరాటాలు, వైభవానికి ప్రతీకగా నిలిచిన ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలకు రూ. 12 కోట్ల వ్యయంతో డైనమిక్ సౌండ్ అండ్ లైటింగ్ సిస్టంను ఏర్పాటు చేశారు. గ్రాఫిక్స్ ద్వారా వర్సిటీ చరిత్ర, ప్రముఖ ఘటనలు, ఉద్యమ ఘట్టాలు, ఇక్కడ చదివిన ప్రముఖుల వివరాలతో వందేండ్ల యూనివర్సిటీ చరిత్రను డాక్యుమెంటరీగా రూపొందించి.. ప్రదర్శించారు.
- ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 29




**అమ్మమ్మ జ్ఞాపకార్థం..** కూకట్‌పల్లిలో మాధవరం సుశీల మెమోరియల్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, కొండల్ రావు, డీఈవో విజయకుమారి తదితరులు

## ఎమ్మెల్సీ నవీన్ సేవా స్ఫూర్తి

కూకట్‌పల్లిలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రూ. 90 లక్షల వ్యయంతో మాధవరం సుశీల మెమోరియల్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనాన్ని పునర్ నిర్మించారు. ఆధునిక వసతులు కల్పించారు. ఈ పాఠశాలను సోమవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, కుర్మయ్యగారి కొండల్‌రావు, జిల్లా విద్యాధికారి విజయకుమారితో కలిసి ప్రారంభించారు. కూకట్‌పల్లి రాజీవ్‌గాంధీనగర్‌లో శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ పాఠశాల భవనాన్ని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ తాత మాధవరం రాంచందర్‌రావు జ్ఞాపకార్థం కోటి రూపాయలను వెచ్చించి పునర్ నిర్మించారని ఎమ్మెల్యే అన్నారు. అలాగే కూకట్‌పల్లిలో అమ్మమ్మ మాధవరం సుశీల జ్ఞాపకార్థం పాఠశాల భవనాన్ని పునర్ నిర్మించి సకల హంగులు కల్పించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంఈవో ఆంజనేయులు, కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, ముద్దం నర్సింహ యాదవ్, పండాల సతీశ్‌గౌడ్, సబీహా గౌసుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.
-కేపీహెచ్‌బీకాలనీ, జనవరి 29



జేసీబీ తో ఇండ్లను కూల్చుతున్న సిబ్బంది

## గాంధీనగర్‌లో పేదల ఇండ్లు కూల్చివేత

### అడ్డుకునేందుకు యత్నించిన బస్తీవాసుల అరెస్ట్

చిక్కడపల్లి, జనవరి 29 : ముషీరాబాద్ నియోజకవర్గం గాంధీనగర్ డివిజన్‌లోని స్వామి వివేకానంద్‌నగర్ బస్తీలో రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులు పేదల ఇండ్లు కూల్చివేయడం ఉద్రిక్తతలకు దారితీసింది. సోమవారం ఉదయం ముషీరాబాద్ తహసీల్దార్ వెంకటలక్ష్మి, జీహెచ్ఎంసీ డీఎంసీ తిపర్తి యాదయ్య, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హేమంత్‌కుమార్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ రమేశ్ పర్యవేక్షణలో జీహెచ్ఎంసీ సిబ్బంది జేసీబీలతో చేరుకున్నారు. కూల్చివేతలను అడ్డుకునే ప్రయత్నం చేసిన బస్తీవాసులను అదుపులోకి తీసుకుని నాంపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. స్థానిక కార్పొరేటర్లు పావని, రవిచారి, బీజేవైఎం నాయకుడు వినయ్‌కుమార్‌ను కూడా పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను సైతం అడ్డుకున్నారు. అనంతరం సిబ్బంది బస్తీలోని 20 ఇండ్లను నేలమట్టం చేశారు. అధికారులు హైకోర్టు ఆదేశాల మేరకు తాము ఇండ్లను కూల్చివేసినట్లు చెప్పారు. కాగా, బస్తీవాసులకు అండగా నిలవడానికి వచ్చిన ఎమ్మెల్యే ముఠాగోపాల్‌తో పాటు వివిధ పార్టీల వారికి, మీడియా ప్రతినిధులకు పోలీసులు అనుమతి ఇవ్వలేదు. కోర్టు ఆదేశాలు ఉన్నాయంటూ పేదలకు అన్యాయం చేయడం సరికాదని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. ఇండ్లు కోల్పోయిన వారికి డబుల్ బెడ్రూం ఇండ్లు ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌తో మాట్లాడినట్లు చెప్పారు. అధికారులు పేదలకు అన్యాయం చేశారని కాంగ్రెస్ పార్టీ నాయకులు గుర్రం శంకర్, జీఎన్ కేశవ్ అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ కొద్ది రోజులు వెసుల బాటు కల్పించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించినా.. పట్టించుకోలేదన్నారు.